నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ సోమవారం 5 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL




సోనాల జడ్పీ పాఠశాలలో భయం భయంగా తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థులు

క్లిక్..క్లిక్..




బోథ్ మండలంలోని సోనాల జడ్పీ పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్న పాత భవనం



దస్తురాబాద్ : పెచ్చులు ఊడిన పైకప్పు

# శిథిలం.. బడి భవనం

## ఊడిపడుతున్న పెచ్చులు.. భయాందోళనలో విద్యార్థులు

బోథ్/దస్తురాబాద్, ఆగస్టు 4 : పెచ్చులూడుతున్న పైకప్పు.. వర్షం వస్తే ఊరుస్తున్న భవనం.. ఏ క్షణాన ఏం ప్రమాదం ముంచుకొస్తుందోననే భయం.. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని విద్యార్థులు తరగతి గదుల్లో చదువుకుంటున్నారు. బోథ్ మండలంలోని సోనాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.. దస్తురాబాద్ మండలంలోని బుట్టాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి.

### బోథ్ మండలంలోని సోనాల జడ్పీ పాఠశాల..

బోథ్ మండలంలోని సోనాల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు దాదాపు 560 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 1971 సంవత్సరంలో నిర్మించిన ఆరు గదులు ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం పడితే ఊరుస్తున్నాయి. పెచ్చులు ఊడి పడుతున్నాయి. 1985-86 మధ్య నిర్మించిన మరో నాలుగు, 1994లో కట్టిన మరో నాలుగు గదులది ఇదే దుస్థితి. 2011 సంవత్సరంలో రాజీవ్ విద్యా మిషన్ పథకంలో భాగంగా ఏడు గదులు నిర్మించారు. ఐదు నుంచి పదో తరగతికి వరకు అన్నీ తరగతుల్లో ఏ, బీ సెక్షన్లుగా విభజించి పాఠాలు బోధిస్తున్నారు. తొమ్మిదో తరగతిలో ఎక్కువ మంది విద్యార్థులుండడంతో మూడు గదుల్లో పాఠాలు బోధిస్తున్నారు. పాఠాల బోధనలకు 11 గదులతోపాటు కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, ఉపాధ్యాయుల(మేల్, ఫిమేల్ వేర్వేరుగా కూర్చునేందుకు) స్టాఫ్ రూంలు, ప్రధానోపాధ్యాయుని గది, ల్యాబోరేటరీ, స్టోర్ రూంలకు మరో ఏడు గదులు అవసరమవుతున్నాయి. మూడేళ్ల క్రితం పది గదుల నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరు కాగా.. నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. కానీ.. ప్రారంభానికి నోచుకోలేదు. త్వరగా ప్రారంభించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

### బుట్టాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల..

దస్తురాబాద్ మండలంలోని బుట్టాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనాలు శిథిలాస్థకు చేరుకున్నాయి. 1 నుంచి ఏడో తరగతి వరకు 135 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో ఐ దు గదులు ఉండగా రెండు గదులు మాత్రం శిథిలావస్థకు చేరుకున్నా యి. వర్షానికి పైకప్పు నుంచి వర్షపు నీరు గదుల్లోకి చేరుతున్నది. ఈ క్రమంలో వర్షానికి తడిసి పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. పిల్లలపై పడుతాయేమోనని ఆందోళనకు గురవుతున్నారు. సరిపడా గదులు లేక విద్యార్థులను ఎ క్కడ కూర్చో బెట్టాలని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. ప్ర మాదాలు జరగక ముందే జిల్లా, మండల ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



దస్తురాబాద్ : ఊడిన పైకప్పు పెచ్చులు




బోథ్ : సోనాల జడ్పీ పాఠశాలలో నిర్మాణం పూర్తయినా ప్రారంభించని భవనం



దస్తురాబాద్ : శిథిలావస్థలో పాఠశాల భవనం



## డైనింగ్ హాల్, కిచెన్ లేక అవస్థలు

↑ అపరిశుభ్రత ప్రాంతంలో భోజనం వడ్డిస్తున్న సిబ్బంది



డైనింగ్ హాల్ లేక బయటనే భోజనం చేస్తున్న విద్యార్థులు

కుంటాల మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో భవనాలు 'మన ఊరు-మన బడి' కింద పూర్తయ్యాయి. కానీ.. డైనింగ్ హాల్, వంట గది నిర్మాణ పనులు పూర్తి చేయకుండానే వదిలేశారు. దీంతో విద్యార్థులు చెట్ల కింద భోజనం చేయాల్సి వస్తున్నది. మధ్యాహ్న భోజన సిబ్బందికి కిచెన్ షెడ్డు లేక బయటనే వంటలు చేస్తున్నారు. బాలురకు తాత్కాలికంగా టాయిలెట్లు ఏర్పాటు చేసినా అది సౌలభ్యంగా లేకపోవడం వల్ల వాడడం లేదు. సరైన మరుగుదొడ్లు లేక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు అవసరమైన వసతులు కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. - కుంటాల, ఆగస్టు 4

# దళితబస్తీతో లక్షల కుటుంబాలకు కళ

## రూ. 16 లక్షల దళితబస్తీ డీడీలు అందించిన ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



డీడీలు అందుకున్న దళితబస్తీ లబ్ధిదారులతో ఎమ్మెల్యే అనిల్ జావద్

భీంపూర్, ఆగస్టు 4 : దళితుల కుటుంబాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన దళితబస్తీ పథకం లక్షల మందిని ఆదుకుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం భీంపూర్‌లో 51 మంది దళితబస్తీ లబ్ధిదారులకు రూ.15,84,830 పెట్టుబడి సాయం డీడీలను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సంతోషంగా స్వీట్లు పంచుకున్నారు. తాంసి మండలంలోని ఈదుల్లాసావర్గాం, పొన్నారి.. భీంపూర్ మండలంలోని తాంసి(కె), పిప్పల్‌కోటి గ్రామాల మహిళలకు డీడీలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితబస్తీలో రాష్ట్రంలోనే భీంపూర్ మండలం మేటిగా నిలిచిందని గుర్తు చేశారు. కరంజికి డబుల్ రోడ్డు సహ ఇతర గ్రామాల రోడ్లు నిర్మాణం అవుతాయన్నారు. కాంగ్రెస్ సర్కారు కొత్త మండలాల కార్యాలయాలు నిర్మించాలన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే వచ్చేటపుడు కప్పర్ల మహిళా కూలీలు కలిసి సమస్యలను వివరించారు. కేసీఆర్ రాజ్యమే బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, డీటీ హరీశ్, మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, మాజీ వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, బీఆర్ఎస్ కన్వీనర్లు మేకల నాగయ్య, గంధం రమణ, కృష్ణ, నాయకులు గోవర్ధన్ యాదవ్, జి.నరేందర్ యాదవ్, జహూర్ అహ్మద్, బాదర్, లింబాజీ, సంతోష్, కల్చాప్ యాదవ్, అనిల్, నితిన్, ధరంసింగ్, నాగారెడ్డి, అఫ్రోజ్, అశోక్, జాదవ్ రవీందర్, రఘు, గోవర్ధన్‌రెడ్డి, ముకుంద సంతోష్, దొంతుల సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

### అంగడిలో ఎమ్మెల్యే

భీంపూర్ ఆదివారం వారసంతను ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ కలియ తిరిగారు. అంగడిలో చిరువ్యాపారుల సమస్యలను తెలుసుకున్నారు. బజ్జీ రుచిచూసి వారికి రూ.500 ఇచ్చారు. అంగడిలో మరిన్ని సౌకర్యాలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఎమ్మెల్యే మాట్లాడుతుంగా.. కరెంటు పాయే



కరెంటు పోవడంతో మైకు పక్కన పెట్టి మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండల కేంద్రంలో దళితబస్తీ లబ్ధిదారులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పెట్టుబడి సాయం చెక్కులు అందజేసి మైకుతో సభలో మాట్లాతున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 12.41 గంటలకు కరెంటు పోయింది. అనంతరం 12.44 గంటలకు కరెంటు రావడంతో మాట్లాడారు. మండలంలో కరంజి సహా ఇంకొన్ని గ్రామాల్లో ప్రత్యేక ఫీడర్లు ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గంలో కరెంటు సమస్యల గురించి తరచుగా తమకు ఫోన్లు వస్తున్నాయన్నారు. - భీంపూర్, ఆగస్టు 4

# బీఆర్ఎస్ నోటిఫికేషన్స్‌తోనే అభ్యర్థులకు ఉద్యోగాలు

### మాజీ మంత్రి జోగు రామన్న



విద్యార్థినిని సన్మానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, ఆగస్టు 4 : కేసీఆర్ సర్కారు నాణ్యమైన విద్యతోపాటు ఉద్యోగ నోటిఫికేషన్స్ విడుదల చేయడంతోనే అభ్యర్థులు ఉద్యోగాలు పొందుతున్నారని మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణానికి చెందిన గోస్కుల విజయ ఏఈఈ ఫలితాల్లో సత్తా చాటి, మిషన్ భగీరథ డిపార్ట్‌మెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగం సాధించడంపై రామన్న హర్షం వ్యక్తం చేశారు. తిలక్‌నగర్‌లోని ఉద్యోగం సాధించిన విద్యార్థిని ఇంటికి చేరుకుని విజయతోపాటు ఆమె తల్లిదండ్రులు రవీందర్-సంగీతను శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, వార్డు కౌన్సిలర్ కొండ గణేశ్, నల్ల మహేందర్, సంజయ్, కోవ రవి, తదితరులు పాల్గొన్నారు.

# పాముకాటుతో యువతి మృతి



సిడాం లక్ష్మి(ఫైల్)

గుడిహత్నూర్, ఆగస్టు 4 : సోమార్‌పేట్ గ్రామానికి చెందిన సిడాం భీంరావ్-దుర్గాబాయి దంపతుల కూతురు సిడాం లక్ష్మి(26) శనివారం రాత్రి ఇంటి ముందర గల గుడిసెలో పడుకున్నది. ఆదివారం తెల్లవారు జామున కుడికాలు పాదం వెనుక భాగంలో ఏదో విషపురుగు కుట్టింది. ఏదో మంట మండుతుందని, కడుపులో తిప్పుతుందని కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఉదయం 10 గంటల ప్రాంతంలో చనిపోయింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు.